గాడి తప్పిన ప్రజా పంపిణీ!



బయోమెట్రిక్ వేస్తున్న లబ్ధిదారుడు

- ఇంటికి దూరంగా రేషన్ బండి
- వినియోగదారులకు తప్పని ఎదురుచూపు
- రెండు నెలలుగా అందని కందిపప్పు
- అరకొరగానే పంచదార పంపిణీ
- ప్రజల గోడు పట్టని కూటమి ప్రభుత్వం

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీఎం వాహనం(రేషన్ బండి) ప్రతీ నెలా నిర్ణీతసమయానికి వచ్చేది. లబ్ధిదారులకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరకులు సైతం పంపిణీ చేసేవారు. పండగ వేళల్లోపంచదార, కందిపప్పు వంటి సరకులు అదనంగా ఇచ్చేవారు. కూలిపనులకు వెళ్లేవారు, ఇళ్ల నుంచి కదల్లేని వృద్ధులకు ముంగిటకు రేషన్ బండి వెళ్లేది. వలంటీర్ల ద్వారా ముందుగానే లబ్ధిదారులకు సమాచారం ఇచ్చేవారు. దీంతో ఆ ప్రాంతం వారు తమకు కేటాయించిన సమయంలో వెళ్లి హాయిగా సరకులు తెచ్చుకునేవారు.

నేడు సీన్ రివర్స్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ కోసం ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. రేషన్ బండి నెలలో ఎప్పుడు వస్తుందో... ఎక్కడ పెడతారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఎండీఎం వాహనాలు ఇప్పుడు ఏ వీధి చివరన పెడుతున్నారు. ఫలితంగా లబ్ధిదారులకు సవ్యంగా రేషన్ సరకులు అందడం లేదు.చాలా మంది ప్రతినెలా తీసుకోలేకపోతున్నారు.ప్రజాపంపిణీ వ్యవస్థను నీరుగారుస్తున్నారని మండిపడుతున్నారు.

కష్టాలు మొదలు

పేదోడికి కష్టాలు మొదలయ్యాయి. రేషన్ కార్డు ఉంటే బియ్యం, నిత్యావసర సరకులతో బతికేయవచ్చనే లబ్ధిదారుల మనోధైర్యం క్రమేపీ సన్నగిల్లుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ సరకులకు కోతపడింది. రేషన్ కార్డుదారులకు ఏ నెలకానెల సవ్యంగా సరకులు అందడం లేదు.

పట్టించుకునే వారేరీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేషన్ సరకుల కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గోపాలపట్నం మండలంలో రేషన్ సరకుల పంపిణీపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండడం లేదు. సివిల్ సప్లై అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో లబ్ధిదారులకు ప్రస్తుతం రేషన్ సరకులు సక్రమంగా అందని పరిస్థితి ఉంది.



కాకానినగర్‌లో రేషన్ కోసం క్యూకట్టిన వినియోగదారులు

రోడ్డుపైనే సరకుల పంపిణీ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీధివీధికి వెళ్లి రేషన్ సరకులు ఇచ్చేవారు. ప్రస్తుతం ఎండీయూ వాహనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో మర్రిపాలెం ఏరియాలో 30 రేషన్ డిపోల పరిధిలో 17 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. అదే విధంగా గోపాలపట్నం-1లో 22 షాపులకు 11 వాహనాలు, సింహాచలం ఏరియాలో 12 షాపులకు 7 వాహనాలు, గవర కంచరపాలెంలో 5 షాపులకు 2 వాహనాలు, చెంగల్రావు పేటలో 15 షాపులకు 6 వాహనాలు, జ్ఞానాపురంలో 11 షాపులకు 5 వాహనాలు, కంచరపాలెంలో 16 షాపులకు 10 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతీ నెలా రేషన్ సరకులు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఎండీయూ వాహనాలను తొలగిస్తారనే ప్రచారంతో వాళ్లలో కూడా నిరాశ నెలకొని కూడళ్లలో రోడ్లపై ఉంచి సరకులు పంపిణీ చేస్తున్నారు.



బాజీ జంక్షన్ రోడ్‌లో ఎండలోనే ఎండీఎం వాహనం వద్ద లబ్ధిదారుల క్యూ

ఉగాదికైనా కందిపప్పు అందేనా..

రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు, పంచదార, కందిపప్పుతో పాటు పండగ రోజుల్లో అయితే గోధుమలు, మంచినూనె కూడా ఇచ్చేవారు. కానీ, ప్రస్తుతం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. పైనుంచి సరఫరా లేదని, తామేమే చేయలేమని ఎండీయూ వాహనదారులు లబ్ధిదారులకు చెబుతున్నారు. ఇచ్చే సరకులు కూడా సకాలంలో పంపిణీ చేయటం లేదని లబ్ధిదారులు అంటున్నారు. ఉగాది పండగ వేళ అయినా కందిపప్పుతో మిగతా సరకులన్నీ ఇస్తారా..? లేదా అనే అనుమానాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లవద్దు

సింథియా: ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువత, విద్యార్థులకు బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్ సూచించారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి అంబేడ్కర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల యువత ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈజీ మనీకి అలవాటు పడి ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతున్నారని, కొంత మంది సెలబ్రిటీలు కూడా వాటిని ప్రోత్సహించడం దారుణమన్నారు. ఇప్పటికైనా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బారికేడ్ల ఏర్పాటు



బారికేడ్లు అందించిన ఆలివ్ సంస్థ ప్రతినిధికి అభినందనలు తెలుపుతున్న ఏడీసీపీ ప్రవీణ్ కుమార్

గోపాలపట్నం: జాతీయ రహదారిలో ఎన్ఏడీ జంక్షన్ మెయిన్ గేటు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలోఎన్ఏడీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ఈ రహదారిలో ద్విచక్రవాహనాలు, ఆటోలు రాంగ్ రూట్‌లో వెళుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దీన్ని నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని తెలిపారు. అందుకు ఈ జంక్షన్‌ను మూసి వేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు లేని నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు. మూవింగ్ బారికేడ్లు అందించిన ఆలివ్ సంస్థ ప్రతినిధి సతీష్, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు, కంచరపాలెం సీఐ దాశరథి, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షపు నీటిని ఒడిసి పడదాం



చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం క్యాచ్‌దా రెయిన్, వేర్ ఇట్ ఫాల్స్ ఇన్ ఇట్ ఫాల్స్ అనే నినాదంతో ఆళ్వార్ దాస్ ప్రైమరీ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని భూగర్భ జల వనరుల శాఖ జాయింట్ డైరెక్టర్ కేఎస్ శాస్త్రి వర్చువల్‌గా ప్రారంభించారు. చిన్నారుల చేత రైలు ఆట మాదిరిగా చెట్టు చుట్టూ నినాదాలు చేస్తూ తిరిగారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ సలాది శ్రీరామ కృష్ణయ్య మాట్లాడుతూ నీటిని సంరక్షించుకోవాలని.. అది భావి తరాలకు ఉపయోగపడుతుదని అన్నారు. మొక్కలు నాటడం, పక్షులకు హాని కలిగించకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బి. హేమ చంద్రరావు, కె. అపర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్పీపేట యూపీహెచ్‌సీకి ఉత్తమ అవార్డు



డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ శశిప్రియాంక

కంచరపాలెం: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన వేడుకల్లో కంచరపాలెం ఆర్పీపేట యూపీహెచ్‌సీ డాక్టర్ మట్టా శశిప్రియాంకకు ఉత్తమ అవార్డు, ప్రశంసా పత్రాన్ని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు అందజేశారు. ఇదే యూపీహెచ్‌సీకి చెందిన హెచ్‌వీ నూనెల పైడిరాజు, ఏఎన్ఎం రత్నం కూడా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న చేస్తున్న ఉద్యోగులు

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలోని ఐఎన్ఎస్ సర్కార్ వద్ద ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్జన్ రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సేకరించిన రక్తాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్‌కు అప్పగించారు. అత్యవసర రక్తమార్పిడి, శస్త్ర చికిత్స, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కోసం శిబిరం నిర్వహించినట్టు గోపీనాథ్ తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించారు.

కెపాసిటీ బిల్డింగ్‌పై కార్మికులకు శిక్షణ



కార్మికులకు శిక్షణ ఇస్తున్న ప్రొఫెసర్ వెంకటరావు

సింధియా: కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు నేషనల్ బోర్డ్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కార్మికులకు కెపాసిటీ బిల్డింగ్ అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టీయూసీ) నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటరావు పలు అంశాలను వివరించారు. కార్మిక చట్టాలు, రాజ్యాంగ నిబంధనలు, వేతనాల నియమావళిపై అవగాహన కల్పించారు.

ఆహార కల్తీకి పాల్పడిన ఐదు షాపులకు జరిమానా

బీచ్‌రోడ్డు: జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి ఆధ్వర్యంలో నగరంలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో సేకరించిన ఆహారపదార్థాల శాంపిల్స్‌లో కల్తీ ఉన్నట్టు నిర్ధారణ అయింది. దీంతో ఐదు షాపులకు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జరిమానా విధించారు. కంచరపాలెం సంజీవ సాయి ఫ్లోర్ మిల్‌కు రెండు కేసుల్లో రూ.15 వేలు, పెదగంట్యాడ రత్నావారి వంటిల్లుకు రూ.5 వేలు, ఎన్ఏడీ కొత్త రోడ్డులోని చందు స్వీట్స్‌కు రూ.10వేలు, శ్రీలక్ష్మి జనార్దన్ బెంగళూర్ వారి అయ్యంగారి బేకరీకి రూ. 10వేలు జరిమానా విధించారని జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి నందాజీ తెలిపారు.

ఉక్కు కార్మికుల కొవ్వొత్తుల ప్రదర్శన

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం చేపట్టి 1500 రోజులు పూర్తి అయిన సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం కార్మికనేత లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారంపై అనుసరిస్తున్న విధానాలను దుయ్యబట్టారు.ప్రభుత్వం తమవిధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకులు మంత్రిరాజశేఖర్, సీటు నాయకులు అయోధ్యరామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.వి.రమణ,ఇతర కార్మిక సంఘాల నాయకులు మద్దిఅప్పలరాజు,వెంకటరమణమూర్తి, వరసాల శ్రీనివాసరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న కార్మిక నేతలు

బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

సింధియా: బాలల సంరక్షణే ధ్యేయంగా సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సూచించారు. వార్డులో శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావును చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి తద్వారా వాటి నివారణకు కృషి చేయాలని సూచించారు. కమిటీలో తనతో పాటు సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు సభ్యులుగా ఉంటారన్నారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్పీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

డీ మార్ట్ వద్ద పాము కలకలం

గోపాలపట్నం: గోపాలపట్నంలోని డీమార్ట్ వద్ద ఒక పాము భయాందోళనకు గురిచేసింది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో డీ మార్ట్ తెరిచారు. వినియోగదారులు లోపలికి వస్తున్న సమయంలో మార్ట్ ప్రాంగణంలోని కాలువలో పాము కనిపించింది. వెంటనే సిబ్బంది వెంకటాపురానికి చెందిన స్నేక్ క్యాచర్ సాయి మణికంఠకు సమాచారం అందించారు. స్పందించిన మణికంఠ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, చాకచక్యంగా పామును గుర్తించి పట్టుకున్నారు. ఇది విషపూరితమైందని, జెర్రి గొడ్డు అని మణికంఠ తెలిపారు. ఈ పామును సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచిపెడతానని చెప్పారు. ఎక్కడైనా పాములు కనిపిస్తే వాటిని చంపవద్దని, సహాయం 63009 36547, 79956 21522 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.



గోపాలపట్నం డీమార్ట్ ప్రాంగణంలో పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ మణికంఠ

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ- తరంగ్-2025 పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్ శనివారం వేడుకగా ప్రారంభమైంది. ఫెస్ట్ ప్రారంభోత్సవం వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డా. కె. కుమార్ రాజా (మేనేజింగ్ డైరెక్టర్ - కె.కుమార్ రాజా ప్రాజెక్ట్)విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నూతన విషయాలపై అవగాహన, పరిశోధన రంగాల్లో అవకాశాలు దక్కించుకునేలా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా కళాశాల ఈసీఈ హెచ్‌వోడీ ప్రొఫెసర్ పీవీ శ్రీదేవి మాట్లాడుతూ, ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థుల క్రియాశీలత, వినూత్న ఆలోచనల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. పద్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రాక్టికల్ జ్ఞానాన్ని పొందేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. సీఎస్ఈ హెచ్‌వోడీ ఆచార్య బి.ప్రజ్ఞ, సివిల్ హెచ్‌వోడీ డా.జి. శిరీష, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డా.ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరిలో అధ్యాపకులకు సన్మానించారు. అదే విధంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఈ-తరంగ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పోలీస్ స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల మాయం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు మాయం కావడం మిస్టరీగా మారింది. గాజువాక క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాలు.. నెల కిందట పాతగాజువాక జంక్షన్‌లో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులు గాజువాక స్టేషన్‌కు తరలించారు. తర్వాత వాహనం అదృశ్యమైంది. ఎవరన్నా తీసుకువెళ్లారా అనే సందిగ్ధత నెలకుంది. ఇదిలా ఉంటే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 15 రోజుల కిందట పట్టుబడిన బుల్లెట్ కూడా కనిపించలేదు.

పనులు వేగవంతం చేయండి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



పనులను పరిశీలిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరాస మెయిన్ రోడ్డు ప్రాంతంలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పనులను శనివారం నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. వార్డు పర్యటన అనంతరం అధికారులతో కలసి అభివృద్ధి పనులపై సమీక్షించారు. మెయిన్ రోడ్డులో పనుల దృష్ట్యా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ సప్లై ఏఈ సుమన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సన్యాసఅప్పారావు, అనూప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వేద విద్య ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



ప్రొఫెసర్ శేషాద్రి

దాబాగార్డెన్స్: పల్నాడు జిల్లా మాదిపాడులోని వేద వేదాంత గురుకుల మహా విద్యాలయంలో వేద విద్య ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రొఫెసర్ శేషాద్రి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఇది ఓ సువర్ణావకాశమని చెప్పారు. వేద విద్యనభ్యసించదలచిన వారు 9963057025 నంబరుకు వాట్సాప్ సందేశం పంపాలని తెలిపారు. విద్యార్థులకు ధార్మిక విలువలతో కూడిన ఆధునిక విద్య అందించడంతో పాటు, ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందించేందుకు అవసరమైన మెలకువలు నేర్పనున్నట్టు చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు హరిత వనం ఇదే సందర్భంలో మహా విద్యాలయ ప్రాంగణంలో ఔషధ వృక్షాలు నాటనున్నట్టు ప్రకటించారు. వేద విద్యార్థులకు తగిన ఆర్థిక సహకారం, ఉపకార వేతనాలు అందజేయనున్నట్టు చెప్పారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అగనంపూడి: జీవీఎంసీ 77, 79 వార్డులకు వెళ్లే ప్రధాన పైప్‌లైన్ లంకెలపాలెం సమీపంలోని ఏలేరు కాల్వ వద్ద మరమ్మతులకు గురవ్వడంతో ఆదివారం నీటిసరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కేదారినాథ్ తెలిపారు. ఈ కారణంగా లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, పిట్టవానిపాలెం, దేవాడ, అప్పికొండకాలనీ, మదీనాబాగ్, పరవాడ హౌసింగ్ బోర్డు కాలనీలకు నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు. అసౌకర్యానికి సహకరించాలని ఆయన కోరారు.

హామీలు అమలు చేయాల్సిందే

మల్కాపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం నాయకురాలు మమత అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసమస్యలు తెలుసుకోవడానికి చేపట్టిన ప్రజాచైతన్య యాత్రను శనివారం 58వ వార్డులోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటిపట్టాలు వంటి ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. వాటిని అధికారులకు అందజేసి పరిష్కారానికి కృషి చేస్తామని.. స్పందన లేకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు. తక్షణమే ఇళ్ల స్థలాలు.. గతంలో డీడీలు కట్టిన వారికి ఇళ్లు మంజూరే చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకుల తీరు హడావుడి ఎక్కువ పని తక్కువ అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఆస్తి పన్నులో మార్పులు చేర్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విమల,ఈశ్వరమ్మ,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై సర్వే

సింధియా: సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాంతినగర్‌లో శనివారం ఆ పార్టీ మహిళా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించారు. మల్కాపురం జోన్ నాయకురాలు కల్యాణి మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులు, ఇంటి పన్నులు, స్కీమ్ ఇళ్లు లు, కరెంటు చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లు, మంచినీరు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, కాలువలు, వంటి పలు సమస్యలపై ప్రజల నుంచి ఆర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు తెలియజేసి వాటి పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జయలక్ష్మి, ఎస్.ఆదిలక్ష్మి, ఎస్.లక్ష్మి, కుమారి, గోవిందమ్మ పాల్గొన్నారు.



ఇంటింటి సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

సెమీస్‌కు మూట్ కోర్టు పోటీలు

విశాఖ విద్య: న్యాయ విద్యార్థుల్లో నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించే విధంగా జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు జరుగుతున్నాయి. ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు రెండో రోజు శనివారం ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 24 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరగనున్న సెమీ ఫైనల్స్‌కు నాలుగు జట్లు చేరుకున్నాయి. శనివారం నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత న్యాయమూర్తులు డాక్టర్ బి.సత్యనారాయణ, డి.ధర్మారావు, విశాఖ న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు కె.ఏ ప్రకాష్, బి.వి.ఆర్.మూర్తి వ్యవహరించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ కళాశాల పూర్వాచార్యులు ఆచార్య వి.కేశవరావు ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య వి.రాజ్యలక్ష్మి, ఆచార్య చంద్రకళ, మూట్ కోర్టు పోటీల సమన్వయ కర్త డాక్టర్ ఎల్.వి.కె ప్రసాద్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.



న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ప్రచారం

అల్లిపురం: దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కంబాన్ని ముద్దాడిన యువకిశోరం సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి స్ఫూర్తితో, ఈ నెల 23వ తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వరకు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడవసారి మోదీ అధికారం చేపట్టిన తర్వాత ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఓకార్పొరేట్లకు ఉపయోగపడే మూడు నల్ల చట్టాలు రద్దు చేయాలని నాలుగు సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్న రైతుల నిరసన శిబిరాలను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, ఎ. విమల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

తల్లిదండ్రుల చెంతకు బాలిక

అక్కిరెడ్డిపాలెం: ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయిన బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. జీవీఎంసీ 68వ వార్డు మింది గ్రామానికి చెందిన గుర్రాల ప్రియ (8) మింది జిల్లా పరిషత్ స్కూల్లో 3వ తరగతి చదువుతుంది. తండ్రి సత్యనారాయణ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ప్రియ అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. శ్రీహరిపురం వద్ద తచ్చాడుతుండగా సచివాలయ ఉద్యోగులైన బి.వాసవి, యోగిత గమనించి పాప వివరాలను అడిగి తెలుసుకుని గాజువాక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఐ నజీర్ తండ్రికి సమాచారం అందించారు. వారు వచ్చిన తర్వాత బాలికను అప్పగించారు.



ప్రియను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న గాజువాక పోలీసులు